శిథిలావస్థకు ఉప్పలూరు వంతెన

- జీటలు వారిన వంతెన దిమ్మెలు
- భారీ లోడు వాహనాలతో పొంచి ఉన్న ముప్పు

కంకిపాడు: భారీ లోడు వాహనాల రాకపోకలతో వంతెనపై డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి. ఇప్పటికే వంతెన దిమ్మలకు పగుళ్లు ఏర్పడ్డాయి. వంతెన శిథిలావస్థకు చేరువ అవుతోంది. శ్లాబుపై పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఉప్పలూరు వద్ద రైవస్‌కాలువపై వంతెనకు ఎప్పుడెలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం ప్రజల్లో నెలకొంది.

ఊడిపడుతున్న దిమ్మెల రాళ్లు

రైవస్‌కాలువపై ఉప్పలూరు వద్ద రాకపోకలకు వీలుగా 1939లో వంతెన నిర్మించారు. విజయవాడ-మచిలీపట్నం నుంచి విజయవాడ-ఏలూరు ప్రధాన రహదారి మార్గాలకు అనుసంధానంగా ఉన్న రహదారి మార్గం కంకిపాడు-గన్నవరం. ఈ మార్గంలో ఉప్పలూరు వద్ద రైవస్‌కాలువపై ఉన్న ఈ వంతెన మీదుగానే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గన్నవరం విమానాశ్రయానికి వెళ్లే ప్రజలు సైతం ప్రధానంగా ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ వంతెన శిథిలావస్థకు చేరువ అయ్యింది. వంతెన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన దిమ్మలు పగుళ్లువారి నిర్మాణానికి వినియోగించిన రాళ్లు ఊడిపడుతున్నాయి. దీనికి తోడు వంతెన శ్లాబు పెచ్చులూడి దెబ్బతింటోంది. అక్కడక్కడా పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి క్రమేపీ ఖాళీలు పెద్దవిగా పెరుగుతున్నాయి.


ఉప్పలూరు వద్ద రైవస్‌కాలువపై ఉన్న వంతెన

భారీ లోడు వాహనాలతో సమస్య జఠిలం

కొద్ది రోజులుగా వంతెన మీదుగా భారీ లోడుతో ఇసుక, రబ్బిష్ నింపిన లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. పరిమితికి మించి రవాణా సాగించడంతో వంతెన పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. వాహనాలధాటికి ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో పరిసర గ్రామాల ప్రజలు ఉన్నారు. ఏళ్ల తరబడి వంతెన అభివృద్ధి అంశం పెండింగ్‌లోనే ఉంది. ఉప్పలూరు, కేసరపల్లి వంతెనలు, బుడమేరు బ్రిడ్జి అభివృద్ధికి రూ.120 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ అంచనాలు రూపొందించింది. అయితే నేటికీ నిధులు విడుదల అంశం కొలిక్కి రాలేదు. ఫలితంగా నిత్యం ఇక్కడి ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.


పగుళ్లు వారిన వంతెన దిమ్మలు


వంతెనపై ఏర్పడిన పెద్ద పెద్ద ఖాళీలు

వంతెనలను పట్టించుకోరా?



ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారు. ఎంతో చేస్తామన్నారు. ఏవీ జరగడం లేదు. రోడ్లు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఉప్పలూరు వంతెన ఎంతో ముఖ్యమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం ఈ మార్గంలోనే వెళ్తుంటారు. కానీ ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి భారీ లోడు వాహనాలు వెళ్తున్నాయి. ఎప్పుడెలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం మమ్మల్ని వెంటాడుతోంది.

నెరుసు రమేష్, ఉప్పలూరు

ప్రమాదం పొంచి ఉంది



రైవస్ కాలువపై ఉన్న వంతెన మీదుగా విజయవాడ-మచిలీపట్నం, విజయవాడ-ఏలూరు రోడ్డు మార్గాలను కలిపే ప్రధాన రోడ్డు. భారీలోడు వాహనాలతో వంతెనకు ప్రమాదం వచ్చి పడింది. ఆఖరికి వ్యవసాయ ఉత్పత్తులు తరలించాలన్నా భయం వేస్తోంది. వంతెన కూలితే మండలంలోని ప్రధాన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలి.

కలపాల ఏసుపాదం, ఉప్పలూరు

చర్యలు తీసుకుంటాం

వంతెనపై ఏర్పడిన గోతులను అత్యవసరంగా పూడ్పించే చర్యలు తీసుకున్నాం. మరమ్మతులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. భారీ వాహనాలను వంతెన మీదుగా వెళ్లకుండా ఆదేశాలిచ్చాం. ఉప్పలూరు, కేసరపల్లి, బుడమేరు బ్రిడ్జి అభివృద్ధికి రూ. 120 కోట్లతో అంచనాలు రూపొందించాం. ప్రభుత్వం దృష్టిలో వంతెన అభివృద్ధి అంశం ఉంది. నిధులు కేటాయించగానే చర్యలు తీసుకుంటాం.

మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కంకిపాడు

క్లుప్తంగా

రోడ్డు భద్రతా నియమాలపై ర్యాలీ



పెనమలూరు: రోడ్డు భద్రతా నియమాలపై కానూరు కేసీపీ ఆదర్శ రెసిడెన్సియల్ విద్యార్థులు శనివారం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు నివారించగలుగుతామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి గులాబీ పువ్వులు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి జే రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం వాటర్ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన గ్రామంతోపాటు కాల్వగట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



కంకిపాడు: గన్నవరం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత చెరుకుమల్లి సతీష్, శిరీష దంపతుల వివాహ మహోత్సవం మంగళగిరి హ్యాపీ రిసార్ట్స్‌లో ఈనెల 11వ తేదీ రాత్రి వైభవంగా జరిగింది. నూతన వధూవరులను పార్టీ సీనియర్ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్యామల, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు శివభరత్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పెనమలూరు ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి తదితరులు ఆశీర్వదించారు. వేడుకను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీ ప్రణీత్‌కుమార్ పర్యవేక్షించారు.

ధనేకుల కాలేజీలో ఎక్సలెన్స్ అవార్డులు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో 13వ వార్షికోత్సవం సందర్భంగా అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులు శనివారం ప్రదానం చేశారు. తొలుత బెంగుళూరు ఇన్‌టెల్ టెక్నాలజీ సీనియర్ డైరెక్టర్ రఫీక్ పుట్టు, న్యూఢిల్లీ పాన్ ఐఐటీ చైర్మన్ దెబశీష్ భట్టాచార్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన జీ అరుణవాణి, కే శిరీష, జీ నారాయణరావు, జే సౌమ్య, ఎస్ యాస్మిన్, ఎన్ సుజాతలకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ కార్యదర్శి ధనేకుల భవానిప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పేరంటాలమ్మ తిరునాళ్ల ఆఖరి రోజు శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, ఆయన సతీమణి జ్ఞానేశ్వరి గ్రామ దేవతలకు పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత శ్రీకనకదుర్గమ్మ గుడిలో పూజలు చేయించిన పట్టువస్త్రాలను యార్లగడ్డ దంపతులు పేరంటాలమ్మ ఆలయంలో గ్రామదేవతలకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళ మహోత్సవ కమిటీ నిర్వాహకులు యర్కారెడి నరసింహారెడ్డి, పార్టీ శ్రేణులు యర్కారెడ్డి కోటిరెడ్డి, గంపా శ్రీనివాస్‌యాదవ్, మాధు శివరామ్‌ప్రసాద్, దేవులపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి సిడిబండి ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం ఊయల కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఉప్పలూరులో వైఎస్సార్ సీపీ సమావేశం

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా నేత బండెల సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని వీఆర్‌ఓ కార్యాలయం సెంటరులో ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పాల్గొంటారని పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్ శిక్షణ

ఉయ్యూరు: ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఎస్ఎస్ఏ ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు శిక్షణ అందించారు. 80 గంటల పాటు శిక్షణ అందించామని ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ అధ్యాపకురాలు కే వినోదిని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాసరావు అభినందించారు.

15,16 తేదీల్లో వికాస్‌లో జాతీయ సదస్సు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీ పరమేశ్వరరావు, డైరెక్టర్ ఎస్ కీర్తిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో వివిధ కళాశాలలు, పరిశ్రమల నుంచి పరిశోధనా పత్రాలు సమర్పించుటకు పలువురు అధ్యాపకులు, స్కాలర్లు, సాంకేతిక నిపుణులు విచ్చేస్తారని చెప్పారు. ముఖ్యఅతిథిగా నమీబియా దేశంలోని విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ కే వెంకటేశ్వర్లు, అమెరికా, ఓమన్ దేశాల నుంచి పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారని పేర్కొన్నారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు


యశస్వి | హర్షిని | జీ అనూష | ఎన్ ఇందు | అక్షయ | లక్ష్మిప్రసన్న | పుష్పలత

గన్నవరం: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో స్థానిక వీకేఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ డీ శ్రీనివాసరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో యశస్వి 976, బైపీసీలో హర్షిని 973, సీఈసీలో దివ్యసాయి ప్రవల్లిక 928 మార్కులతో టాపర్స్‌గా నిలిచినట్లు చెప్పారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకుగాను గుణశేఖర్ 418, బైపీసీలో వేప్సిత 415 మార్కులు వచ్చినట్లుగా తెలిపారు. విద్యార్థులను కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ మోటపర్తి, జీఎస్ఎల్ఎన్ ప్రసాద్ అభినందించారు.

మండలం టాపర్‌గా సబీహ

స్థానిక చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఎంపీసీ విద్యార్థిని ఎస్‌కే సబీహ 980 మార్కులతో మండలం టాపర్‌గా నిలిచినట్లుగా ప్రిన్సిపాల్ జీ గోపాల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా డీ హాసిని 967, ఆర్ కృపాజ్యోతి 966, బైపీసీలో ఏ మేఘన 967, కే శరణ్య 959 సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఎంపీసీలో డీ శ్రీసాయిమన్విత 465, ఐ ఇవంజలి 458, ఎన్ మేరిజ్యోత్స్న 446, బైపీసీలో ఏ హరిణి 430, ఎం జ్యోతి 424, కే అఖిల 424 మార్కులతో ప్రతిభ చాటారని తెలిపారు.

ఉయ్యూరు: ఇంటర్ ఫలితాల్లో ఉయ్యూరు శ్రీశ్రీనివాసా గ్రావిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో డింపుల్ 465, బైపీసీలో సీహెచ్ మహాలక్ష్మి 433 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో జీ రవికిరణ్ 988, పరుచూరి లిపి 987, బైపీసీలో షబనా అజ్మా 983 మార్కులతో ప్రతిభ చాటారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ పరుచూరి నీలిమ అభినందించారు.

వంద శాతం ఉత్తీర్ణత

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బీ అనూష 979, పీ జుహీ 979, బైపీసీలో ఎస్ ఇందు 986, మర్రి సౌమ్య 958 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి తెలిపారు. అలాగే మొదటి సంవత్సరం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

పెనమలూరు: పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్లస్ టు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ బైపీసీలో సీహెచ్ అక్షయ 946, టీ లక్ష్మిప్రసన్న 932, సీహెచ్ పుష్పలత 928, మొదటి సంవత్సరంలో ఎండీ షామాకౌసర్ 417 మార్కులు సాధించారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ


నల్లూరి ఇందు | కే నీలిమ | సీహెచ్ లక్ష్మీకీర్తన | పీ భవాని

కంకిపాడు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ-మెడికల్ అకాడమీ విద్యార్థినులు సత్తాచాటారు. ఫస్ట్ ఇయర్‌లో 99.6, సెకండ్ ఇయర్‌లో 99 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ బైపీసీలో ఎస్ ఇందు 986, ఎంపీసీలో కే నీలిమ 982 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో సీహెచ్ లక్ష్మీకీర్తన 466, బైపీసీలో పీ భవాని 435 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు.

ఎన్నికల్లో సంస్కరణలు చేయాలి


కానూరు లా కాలేజీలో ప్రసంగిస్తున్న ప్రశాంత్‌భూషణ్

పెనమలూరు: దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతం చేయడానికి ఎన్నికల్లో సంస్కరణలు చేయాలని సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ అన్నారు. కానూరు సిద్ధార్థ లా కాలేజీలో శనివారం 'భారతదేశంలో భాగస్వామ్య ప్రజాస్వామ్యం బలోపేతానికి ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో ప్రస్తుత ఎన్నికల విధానం సక్రమంగా లేదన్నారు. ఎన్నికల్లో 51 శాతం ఓట్లు వచ్చిన పార్టీ అధికార పార్టీగా, 49 శాతం ఓట్లు వచ్చిన పార్టీ ప్రతిపక్ష పార్టీగా ఉండి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా లేకపోవడం సరికాదన్నారు. ప్రస్తుత ఎన్నికల విధానంలో నీతిపరులను ఎన్నుకునే అవకాశం కనబడటం లేదన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. ఈవీఎంలు హ్యాక్ జరిగే అవకాశం ఉందని అమెరికాలోని ఒక రీసెర్చ్ సంస్థ ప్రకటించిందని తెలిపారు. ఎన్నికల సంస్కరణకు ప్రజలు సంఘటిత శక్తితో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కే విజయారావు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి


రవిచంద్రబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

పెనమలూరు: భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి అని తిరుపతి మోహన్‌బాబు యూనివర్సిటీ అసోసేట్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ శాకమూరి రవిచంద్రబాబు అన్నారు. కానూరు సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో ఇంగ్లీష్ విభాగం, లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎథిక్స్ ఫ్రమ్ ఎపిక్స్, ఇతిహాసంలోని మానవీయ విలువలు అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహాభారతం, రామాయణంలో నీతిపాఠాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ధర్మం, కర్తవ్యం, నైతికత, కరుణ వంటి అంశాలను ఇతిహాస ఘట్టాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రవిచంద్రబాబును నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం రవిచంద్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమిలో నామినేటెడ్ కుంపటి

- పదవుల్లో బీజేపీకి మొండిచేయి
- సంప్రదింపులు జరిపినా ప్రయోజనం శూన్యం
- అసంతృప్తిలో బీజేపీ శ్రేణులు



కంకిపాడు: కూటమిలో నామినేటెడ్ పదవుల కుంపటి రగులుతోంది. పదవుల కేటాయింపులో మిత్రపక్షంగా ఉన్న బీజేపీకి మొండిచేయిచ్చింది. టీడీపీ నేతలతో పలుమార్లు సంప్రదింపులు జరిపినా ప్రయోజనం చేకూరకపోవడంతో బీజేపీ శ్రేణులు అసంతృప్తితో రగులుతున్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వద్ద పంచాయితీ పెట్టేందుకు ఆ పార్టీ శ్రేణులు సమాయత్తం అవుతున్నారు.

నాడు ఎంతో ప్రాధాన్యం

టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాలు కూటమిగా ఏర్పడి ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా టీడీపీ ముఖ్యనేతలు బీజేపీ శ్రేణులను కలుపుకొని వెళ్లారు. ఎన్నికల ప్రచార కార్యక్రమం దగ్గర నుంచి పర్యటనల వరకూ అన్నింటా ప్రాధాన్యత ఇచ్చారు. అడపాదడపా ప్రాధాన్యత విషయంలో పక్కన పెట్టినా బహిరంగంగా వినిపించిన విమర్శల కారణంగా పరిస్థితులను చక్కదిద్దుకుని ముందుకు సాగారు.

టీడీపీ నేతలకే ప్రాధాన్యత

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులపై అందరూ ఆశలు పెట్టుకున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఇటీవల కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ నియామకం జరిగింది. కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీకి అవకాశం కల్పించారు. డైరెక్టర్లుగా టీడీపీ నేతలను నియమించారు. ఈ విషయంలో బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు అధికార పార్టీ నేతలతో చర్చించారు. ప్రాధాన్యత ఇస్తామంటూ నమ్మబలికారు. తాజాగా పెనమలూరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇందులో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు రెండూ టీడీపీకే కేటాయించారు. డైరెక్టర్లుగా టీడీపీ, జనసేన పక్షాలకు అవకాశం ఇచ్చారు. ఇందులోనూ బీజేపీకి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఇదెక్కడి న్యాయం అంటూ ఆ పార్టీ శ్రేణులు అసంతృప్తితో రగులుతున్నాయి. ప్రచారం, పర్యటనల్లో జనం కోసమే కావాలి కానీ, పదవుల్లో మాత్రం కేటాయింపులు చేయరా? అంటూ బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే చెంతకు పంచాయితీ

తమ పార్టీ పటిష్టత కోసం ఎంతో కాలంగా పని చేస్తున్న కార్యకర్తలు, నేతలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై బీజేపీ వర్గాలు టీడీపీ ముఖ్య నేతలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంపై ప్రశ్నించారు. అసంతృప్తి కారణంగా కూటమి వర్గాల్లో విబేధాలు నెలకొనే పరిస్థితి ఎదురైందని గుర్తించిన నేతలు వచ్చే దఫా ఏఎంసీ కమిటీ పగ్గాలు బీజేపీకి ఇస్తామంటూ ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం కమిటీలో ప్రాధాన్యత కల్పించడంతో పాటుగా, రానున్న కమిటీల్లో ప్రాధాన్యత ఇచ్చేలా స్పష్టమైన హామీ కోసం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వద్దకు పంచాయితీ చేరినట్లు సమాచారం. ఎలాంటి ప్రాధాన్యత, గుర్తింపు ఇవ్వకుండా సాగిస్తున్న విధానాలపై నేతలు మండిపడుతున్నారు.

ప్రారంభమైన శ్రీరంగమ్మ అమ్మవారి మహోత్సవాలు


శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారు

గన్నవరం: మండలంలోని తేలప్రోలులో కొలువైన శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా తేలప్రోలు, సీతారామపురంలో జరుగుతున్న గ్రామోత్సవాన్ని పూర్తిచేసుకుని తెల్లవారుజామున అమ్మవారు ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి ఊయల సేవ నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీకి చెందిన జక్కా చంద్రశేఖర్, ఉదయ్, రమేష్ సోదరులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ఉయ్యూరు: ఉయ్యూరు ప్రధాన సెంటరులో మున్సిపాలిటీ ఆధ్వర్యాన మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు శనివారం చలివేంద్రం ప్రారంభించి ప్రజలకు మంచినీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు, టీడీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, నాయకులు పీ చిరంజీవి, నరేష్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

పెనమలూరు: వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిముక్కల మండలం గడ్డిపాడుకు చెందిన పైడిముక్కల నాగరాజు, మేఘన భార్యభర్తలు. నాగరాజు తాడిగడపలో ఓ ప్రైవేటు కంపెనీలో స్టోర్ మేనేజర్‌గా పని చేస్తుండగా, భార్య మేఘన విజయవాడలో షాపులో పని చేస్తుంది. కాగా నాగరాజు తన వద్ద పని చేస్తున్న మహిళతో చనువుగా ఉంటున్నాడని భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీన మేఘన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం భర్త నాగరాజు, బంధువులు వెతికినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: కామయ్యతోపులో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కామయ్యతోపునకు చెందిన యువతి ప్రసాదంపాడులోని ఓ ఫార్మసీలో చదువుతోంది. ఆమె ఈ నెల 11వ తేదీన కాలేజీకి అని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఫ్రెండ్స్‌కు ఫోన్ చేయగా కాలేజీకి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో యువతి తాత సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.